

# వేటిజీవాలు

జయశ్రీ సారథి

"మీ అమ్మ యివాళగూడ రాలేదేం భారతీ!" అని అడిగింది కమల గిన్నెలు తోమటానికి పట్టుకెళ్తూన్న పనిపిల్ల నుద్దేశించి.

"ఇక అమ్మ పనిలోంకి రాదమ్మా! నెలలు నిండాయి గదా! మా అయ్య వెళ్ళొద్దన్నాడు" అంది గిన్నెలు ఒకచోట చేర్చుకుని, నీళ్ళు పోస్తూ.

"ఇది మీ అమ్మ కెన్నో కాన్పు? ఇక చాలించదా!" అంది కమల చిరుకోపంతో వసారాలోని కుర్చీలో కూర్చుంటూ. భర్త కృష్ణమూర్తి పక్కనే కుర్చీలో పేపరు చదువుకుంటున్నాడు.

"చిన్నదాన్ని అడుగుతావెందుకు? ఆ ప్రశ్నను వాళ్ళ అమ్మానాన్నలముందు ఫామిలీప్లానింగు లెక్చరు దంచు. నువ్వు చాలా ఖచ్చితంగా అమలుచేస్తున్నావుగా" అన్నాడు భర్త ఆమెకేసి ఓరకంటితో చూస్తూ.

కమలకూ—కృష్ణమూర్తికీ పెళ్ళయి

ఐదు సంవత్సరాలు అయింది. పెళ్ళి నాటికి భర్త బేంకులో గుమాస్తాగా ఉన్నాడు. ప్రమోషను వస్తేనేగాని, బిడ్డను కనగూడదనుకున్నారు. పెళ్ళయిన రెండు సంవత్సరాలలో కృష్ణమూర్తి బ్రాంచి మేనేజరు అయ్యాడు. ఇప్పుడు వాళ్ళకి మూడేళ్ళ తనయుడు. ఇంకా రెండేళ్ళు గడిస్తేనేగాని రెండవ సంతానం కూడదని, అంతటితో ఆపాలని కమల నిషేధించింది. అదే ఆమె పెళ్ళిముందు కోరింది. ఆ యిల్లాలి కోరికను అమలుపర్చడానికి భర్త చాలా సహనంతో, నిగ్రహంతో మెసలుకుంటున్నాడు.

"ఎంత లెక్చరు కొడితేనేం? ఫామిలీ ప్లానింగు మనలోగాని వీళ్ళలో రావాలి. మనమేమో యిద్దరితో ఆపేస్తాం. వీళ్లేమో నాలుగో కాన్పుకో, ఐదవ సారో ఆపుతారు. అప్పుడు వీళ్ళు మనకి రెట్టింపు జనాభా అవుతారు. ఇది తీరని సమస్య." కమల ఉపన్యాసాన్ని మధ్యలో తుంచేస్తూ.

"వంటపని చూడు కమలా! నేను కాస్త త్వరగా వెళ్ళాలి" అన్నాడు భర్త.

"అలాగేలెండి! నే నెప్పుడూ వంట అలస్యంగా చేస్తూన్నట్లు. కాన్పుకు ముందు రెస్టు. తర్వాత రెస్టు. చిన్నపిల్ల చాకిరీ చేస్తూంటే తిని కూర్చుంటారు" అని సణుక్కుంటూ వంటగదిలోకి దారి తీసింది కమల.

దీపావళి దగ్గరపడుతూంది. టపాకాయల చప్పుళ్లు అక్కడక్కడ విని పిస్తున్నాయి. ఒకరోజు భారతి వచ్చింది కళ్ళనీళ్ళతో. దాని వెనకాలే వాళ్ళ అమ్మ సత్తెమ్మ వచ్చింది.

"చూడమ్మా! దీని భాగోతం! ఈనెల నా జీతంతో దానికి బట్టలు కుట్టించాలట. ఈ నెల అతగాడి జీతం నూటయాభై. దాంతో యింటి కిరాయి, బియ్యమే వెళ్ళవు. ఈ మూడిళ్ల జీతంతో నెల గడవాలి! నాకు కాన్పు నేడో రేపో వచ్చేట్లుంది" అంది దీనంగా సత్తెమ్మ.

కమలకు బలే కోపం వచ్చింది.

"ఏం! ఇంత కష్టపడి, అది మూడిళ్ళ పని చేస్తూంటే యీడొచ్చిన ఆడపిల్లకి ఒక జత బట్టలు కుట్టించలేవూ! దాని చింకిలంగా నెప్పుడైనా చూసావా? నీవు యేమైనాసరే నేను దానికి కుట్టిస్తాను బట్టలు. సాయంకాలం రావే భారతీ! బజారుకెళ్దాం" అంది. భారతి సంతోషంగా తల ఊపింది. వాళ్ళ అమ్మ మారు మాట్లాడలేదు. కమలకి చాల సంతోషమైంది. తాను విజయం సాధించాననుకుంది.

మూడు రోజుల్లో భారతికి కొత్త బట్టలు కొంది.

దీపావళి రేపనగా భారతీ, వాళ్ళ అమ్మా, నాన్నా కమలయింటికి వచ్చేశారు.

"రేపు పండగనాడు పిండివంటకైనా పైసల్లేవు. ఈ నెల జీతం ఇచ్చేయమ్మా!

నీ కాలు మొక్కుతా! పండగనాడు వస్తుంటాం నీ వీయకపోతే! నాలుగేళ్లై పనిచేస్తున్నాం. ఎవరితో చెప్పుకుంటా మమ్మా నీతోగాక!" అన్నాడు దుర్గయ్య అతి దీనంగా.

"ఓహో! అదా సంగతి! నీకు కంపెనీలో పండుగ 'బోనస్' యీయలేదూ! నేను యిచ్చే జీతమే కావాల్సి వచ్చిందా!"

"నా 'బోనస్' యేమూలకొస్తదమ్మా! ముగ్గురు పిల్లలకూ మూడు జతల బట్టలు కుట్టించాను. భారతికైనా నీవే తెస్తివి? సత్తెమ్మకు చీర తెచ్చాను. నేను అంగీ కుట్టించుకోనేలేదు. ఈ పండగేకదా అమ్మా అందరికీ ముఖ్యమైనది" అని అడుక్కున్నాడు. కమల దీపావళికి ఐదువందలు యిచ్చి పట్టుచీర కొనుక్కుంది. ఆమెది జాలిగుండె. కాస్త ఉన్నవాళ్ళింట్లో పుట్టిన కమలకి బీద వాళ్ళంటే సానుభూతీ, జాలీ ఉన్నాయి. వీలైనంత ఉపకారం చేయాలనీ, వాళ్ళ జీవితాలను సరిదిద్దాలనే తపన ఆమెకుంది. ఆమె మనసు యిట్టే కరిగిపోతుంది. "ఒక్కసారి ఏభై రూపాయలు 'కట్' అయిపోతే వాళ్ళు యెలా గడుపుతారు?" అనుకుంది.

"సరే! యీ నెల పట్టుకుపోండి. మళ్ళీ నెలనుంచీ 20 రూపాయలు పట్టుకుంటాను. ఇంకొక జత బట్టలుగూడా కుట్టిస్తాను మళ్ళీ నెలలో. అది అలా చింకిగుడ్డలతో వస్తే నాకేం బాగులేదు."

"బాగుండకపోతే నీవు కుట్టిపియ్య రాదమ్మా! ఇన్నేళ్ళుగా పనిచేస్తూంది గదా!" అంది సత్తెమ్మ గడుసుతనంగా.

"అలాగే! యీసారి దానికి లంగా కుట్టించి, నీకు యీయాల్సిన కొత్తచీర మానేస్తాలే! అదేగా మా యింట్లో యెక్కువ చేసేది? మీ ఆయన నీకు తెస్తాడు చీరలు!" అంది కమల బింకంగా.

ఎన్నన్నా కమల డబ్బు యిచ్చేసింది. ప్రతినెలా వాళ్ళు యేదో ఒక దీనగాథ ప్రారంభించడం, కమల పూర్తి జీతం యిచ్చేయడం జరుగుతూనే ఉంది.

ఇలా ఆరు నెలలు గడిచాయి. సత్తెమ్మ మగపిల్లాడ్ని కంది. ఆపరేషను చేయించుకుంది. తనే పనిలోకి వస్తూంది.

"మావారు (భర్త) యిప్పుడు నెలకు రు. 300/- లు తెస్తున్నాడు. ఎక్కువగా తాగడం మానేశాడు. నేను 'చిట్టీ' వేస్తున్నాను. పిల్ల పెళ్ళికొచ్చింది. నా జీతం ఆయనవచ్చి అడిగినా యీయకు. నేనైతే అడగను. ఇలా మిగిలిస్తేనే గదా నిమ్మళమౌతుంది" అంది యెంతో అనుభవజ్ఞురాలిలా.

కమల యెంతో సంబరపడింది. "నిజంగా మీకంత బుద్ధి వచ్చిందా! ఇన్నాళ్ళకి నేను చెప్పే సలహాలు నచ్చాయన్నమాట! నీ దబ్బు బేంకులో నీపేర వేస్తాను. మళ్ళీ అడగకూడదు."

"మాకెందుకమ్మా బేంకులు! నీ దగ్గ

రుంటే చాలు. మాకు నీమీద నమ్మకం లేదా" అంది.

ఆ రాత్రి భర్తతో—కమల "చూశారా! వాళ్ళ నెలా దారికి తెచ్చానో! ఈ నెల నుంచీ జీతం అడగరట. భారతి పెళ్ళికి 'సేవ్' చేయాలన్న ఉద్దేశం కలిగింది వాళ్ళకి! అదే గొప్ప ఎచీవ్‌మెంట్ నాకు!" అంది.

"అహ! అలాగా! సంతోషం! ఇది నిజంగా ఆచరణలోనికి రానీ! అప్పుడు చూద్దాం!" అన్నాడు చిరునవ్వుతో చిలిపిగా.

కమల భర్తకేసి చురచురా చూసి, మూతి ముడుచుకుని, దుప్పటిలో తల దూర్చుకుంది.

నాలుగు నెలలు గడిచాయి. ప్రతి నెలా కమల భర్తని హెచ్చరిస్తూంది. "చూశారా! వాళ్లు యీ నెల అడగలేదు" అని. కృష్ణమూర్తి మాత్రం 'చూద్దాం! ఏది యెటుల జరుగనున్నదో!' అంటూండేవాడు.

ఒక్కరోజు— సత్తెమ్మ భర్తతోసహా సాక్షాత్కరించింది. సత్తెమ్మ విచారంగా ఉంది. సత్తెమ్మ మొగుడు యింకా దీనంగా, అపరాధిలా కనిపిస్తున్నాడు. సత్తెమ్మ ఉపోద్ఘాతం మొదలెట్టింది.

"ఏమ్మా! మాకాడ ఆపద వచ్చి పడింది. నీకు నమ్మకం ఉండదు కాని వినితీరాలి. నా మొగుడు చేసిన తప్పి దాలకు 'జుల్మానా' చెల్లించమని కుల పెద్దలు అడుగుతున్నారు. అది చెల్లిస్తే గాని వాళ్లు మమ్మల్ని కులంలో కలుపు కోరు. అప్పుడుగాని భారతికి మనువు కుదరదు" అంది. దీనత్వం, భయం కూడ కన్పిస్తూందామె మాటల్లో.


"ఏమిటీ! నీ మొగుడు చేసిన పాపం!" అంది కమల ఆశ్చర్యంగా, చదువుతూన్న పుస్తకాన్ని మడిచి పక్కకు పెడుతూ.

"నీకు తెలియదా అమ్మా! రెండేళ్ల క్రితం నా మొగుడు సంసారభారం మోయలేక పరారీ అయిపోయి, యేడాదికి గాని రాలేదు. అప్పుడు నేనుపడ్డ పాట్లు ఆ దేవుడికే తెలుసు; నీకుకూడ తెలుసు గదా! ఇప్పుడుకూడ నెలజీతం యిచ్చినట్లే యిచ్చి, రోజుకు రెండూ, మూడు గుంజుకుపోతూనే ఉంటాడు. పిల్లకి పెళ్ళి కావాలంటే మా కులపెద్దలు అంతా చేరి, యితగాడ్ని క్షమించాలి. దానికి పది పన్నెండు మందిని పిలిచి, తాగబెట్టి తిని పించాలి. అప్పుడు వాళ్లు క్షమించి, యిత గాణ్ని కులంలో చేర్చుకుంటారు. దీనికి మూడు వందలైనా ఖర్చవుతుంది."

మొదటసారిగా యీ కథ వింటోంది కమల. మనిషి చేసిన పాపాలను మనిషే క్షమించేయడం! ఇది సత్తెమ్మ అల్లు తూన్న కట్టుకథా!

"అయితే ఆ పెద్దలంతా తాగుతారంటు న్నావుగదా! అది మాత్రం పాపం కాదా! వాళ్లు మాత్రం ఏం పాపాలు చేయలేదా!

స్త్రీలకు ఆస్తి హక్కు :




నీ మొగుణ్ని శిక్షించే అధికారం వాళ్ల కెలా వచ్చింది?'

కమల తార్కికంగా, హేతుబద్ధంగా వాదించి, వాళ్లను మెప్పించాలనుకుంటూంది.

"మీరు సదువుకున్నోళ్లు! మీతో నేను మాటాడలేను. గాని యిది ముమ్మాటికీ నిజం. ఆరోజు మా అయన ప్రమాణం చేస్తాడు వాళ్ల ముంగల. ఇక ముందు యెక్కడికీ పారిపోననీ, పెళ్లాంబిడ్డలను కష్టపెట్టననీ; అప్పుడు గాని, మమ్మల్ని కులపోళ్లు చేర్చుకోరు; మీకు సిత్రంగా ఉంటాయి గానీ మాకు తప్పవమ్మా! ఆ రోజు నువ్వే చూస్తావుగా! మేడ మీంచి చూస్తే మా గుడిసెలో జరిగేది కళ్లబడుతుంది" అంది. ఆ మాటల్లో నిజం ఉందనిపించింది కమలకు. కమల మనసు వికలమైంది. తాను ఓడిపోయాననే నిర్ణయానికి వచ్చింది. ఇక వాదించదలచుకోలేదు. వెంటనే, రెండు వందలు తెచ్చి యిచ్చేస్తూ "ఇక నాదగ్గర దాచక్కరలేదు. ఒక్కసారిగా అడిగితే నా దగ్గరెక్కడఉంటుంది డబ్బు! దీంతో గడుపుకోండి" అని పంపించేసింది.

రెండు రోజుల తర్వాత వాళ్ల గుడిసె ముందు ఒక నల్లని చక్కని బలమైన మేక గడ్డిమేస్తూంది. గుడిసెముందు ఒక ట్యూబ్‌లైటు పెట్టారు. ట్రాన్సిస్టరు లోంచి సినిమా సంగీతం వినిపిస్తూంది. చీకటి కాగానే మేక మాయమై కాస్సే

పటికి, ఘాటైన మసాలా వాసనలు కమల యింటివరకూ వచ్చాయి. కమల మేడమీది బాల్కనీలో నిలబడితే వాళ్ల గుడిసె కన్పిస్తుంది. అప్పుడే, యెన్నో సారాబుడ్డీలు పోగయ్యాయి. పది పదిహేను మంది కులపెద్దలు కులాసాగా, హుషారుగా కబుర్లు చెప్పుకుంటున్నారు. భారతీ, మిగతా పిల్లలూ కొత్త బట్టలతో చలాకీగా తిరుగుతున్నారు. పండగ సందడి వాళ్లింట్లో తాండవిస్తూంది. కమల మనస్సు నిర్వికారంగా ఉంది.

బాధ, అసహనం ఆమెను పెనవేసుకున్నాయి.

భుజం మీద చేయి తగలగానే ఉలిక్కిపడి, వెనక్కి తిరిగింది కమల. భర్త చిన్నగా నవ్వుతూ "నేను వచ్చి యెంత సేపయిందో తెలుసా! నీవు చాలా దీర్ఘాలోచనలో ఉన్నావు. ఏదో కథ వ్రాసేటట్లున్నావు. నిన్ను డిస్టర్బ్ చేయటమెందుకని చాలాసేపు కూర్చున్నాను. కాని సెకండ్‌షోకి వెళ్ళాలి గదా! అడ్వాన్స్‌బుకింగ్ చేయించాను. ఒక్కటిమాత్రం నిజం కమలా! వాళ్లు అదే, ఆ శ్రామికవర్గానికి చెందినవారు, రేపటి మనుష్యులు కారు; కష్టపడి సంపాదించిన డబ్బు మిగుల్చుకోరు; మిగల్చలేరు; వాళ్ళ డబ్బు యిలాంటి మూఢాచారాలకూ, దురలవాట్లకూ ఖర్చవుతుంది. అయినా వారు బాధపడరు. రేపటి చింత లేక, అందమైన వర్తమానాన్ని ఆనందంతో గడిపేస్తూ, భవిష్యత్తును గూర్చి ఆలోచించేవారు యీరోజు గడపలేరు. ఈ రోజు ఆనందమే వారికి మరపురాని అనుభూతి. ఈ అనుభూతి కోసం వాళ్లేమైనా చేస్తారు. ఏమైనా చెపుతారు. మనం చెప్పిన దారికి వారు యెన్నడూ రారు, రాలేరు. వాళ్ళ ఆనందానికి అడ్డురాకపోవడం, వాళ్ళ దుఃఖంలో లీనమై పాలుపంచుకునే పరిస్థితి తెచ్చుకోకుండా ఉండటం వివేకవంతుల లక్షణం. ఎందుకంటే, రెండూ వారు కోరి తెచ్చుకున్నవే! వాళ్ళని మనం చూసీచూడనట్లు ఊరుకోవాలి. తొందరగా తయారవ్వు. ఏదైనా హోటల్లో భోంచేసి, సినిమాకు పోదాం" అని తొందరచేశాడు భర్త. కమల భర్తకేసి తృప్తిగా చూసి, తేలికపడ్డ మనస్సుతో లోనికెళ్ళింది, ఏదో నగ్నసత్యం తెలుసుకున్నట్లుగా.

